క్లుప్తంగా...

నేడు అనంతలక్ష్మి పారాయణం

మల్కాజిగిరి: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆనంద్‌బాగ్‌లోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ఆవరణలో శతకోటి శ్రీలలితా రహస్య నామ పారాయణ యజ్ఞం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ అనంత లక్ష్మి చే లలితా సహస్రనామ పారాయణ విశిష్టత, పారాయణ విధానంపై ప్రవచనం జరుగుతుందన్నారు.

బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శిగా రతన్



నియామకపత్రాన్ని అందుకుంటున్న రతన్ సూర్యప్రకాష్

కుషాయిగూడ: బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శిగా మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన రతన్ సూర్యప్రకాష్ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు గురువారం నియామకప్రతాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన సమాజ్ అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సమాజ్ అభ్యున్నతికి తనవంతు తోడ్పాటు అందిస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ ప్రతినిధులు వెంకటేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు సోదరభావంతో మెలగాలి



హోమంలో పాల్గొన్న పద్మశాలి కులస్తులు

బోడుప్పల్: పద్మశాలీ కులస్తులు ఐకమత్యంగా ఉండి సోదరభావంతో మెలగాలని కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మగౌడ్, రాసాల వెంకటేష్ యాదవ్ అన్నారు. 15వ డివిజన్‌లోని బొల్లిగూడ ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీమార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీగాయత్రీ హోమం, మహా మృత్యుంజయ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించగా వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పడతం లోకేష్, పద్మశాలి సంఘం కులస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రి యజ్ఞం



రామంతాపూర్: ఇందిరానగర్‌లోని శ్రీభక్త మార్కండేయ శివాలయంలో రాఖీ పూర్ణిమ పర్వదినం పురస్కరించుకుని గురువారం స్థానిక పద్మశాల సంఘం ఆధ్వర్యంలో గాయత్రి యజ్ఞం, యజ్ఞోపధారణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు చుక్క సత్యనారాయణ, కార్యదర్శి గుండ్ల రవీందర్ కుమార్, కోశాధికారి చింతల సత్యనారాయణ, గంజి వెంకటేష్, గోపి, రమేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు రాఖీ కడుతూ..



ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళ



సైనిక్‌పురిలో బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి రాఖీలు కడుతున్న మహిళలు



ఉప్పల్ అపురూప జగపతి హైట్స్‌లో చిన్నారులు

సంతోషాల రాఖీ..

రాఖీ పర్వదినాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి హారతి ఇచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపారు. రాఖీలు కట్టేందుకు సోదరీమణులు సోదరుల ఇళ్లకు వెళ్లగా.. అక్కాచెల్లెళ్లతో రాఖీలు కట్టించుకునేందుకు సోదరులు వివిధ ప్రాంతాలకు వెళ్లడం కనిపించింది. రాఖీల కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి.



కాంగ్రెస్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు



గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్‌కు రాఖీ కడుతూ..



చెంగిచర్లలోని విద్యాజ్యోతి స్కూల్‌లో విద్యార్థులకు రాఖీలు కడుతున్న స్వయం సేవక్ సంఘ్ ప్రతినిధులు

రోడ్లపై అడ్డగోలుగా ర్యాంపుల నిర్మాణం

వనస్థలిపురం: ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని అంతర్గత రోడ్లపై అడ్డగోలుగా నిర్మిస్తున్న ర్యాంపుల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఒక నిర్దిష్టమైన పద్ధతి లేకుండా రోడ్లపైకి ర్యాంపుల నిర్మిస్తుండటంతో చాలాచోట్ల రోడ్లు ఇరుకుగా మారి ఆ దారిన వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ర్యాంపుల నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ, కాలనీ సంక్షేమ సంఘాలు గానీ పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇళ్ల యజమానులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు.



హయత్‌నగర్ డివిజన్ సుభద్రానగర్‌లో రోడ్డుపైకి వచ్చిన మెట్లు, రెయిలింగ్‌లు

- బస్సులు తిరిగే రహదారులతో పాటు, కాలనీల్లో రోడ్ల వెంబడి ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు నిర్మిస్తుండటంతో వాటి ర్యాంపులు, మెట్లు, రెయిలింగ్‌లు రోడ్డుపైకి వస్తున్నాయి.
- రోడ్డుకు సమాంతరంగా ఇళ్లు నిర్మిస్తే భవిష్యత్‌లో రోడ్డు ఎత్తును పెంచితే దిగువకు అవుతాయనే ఉద్దేశంతో నిర్మాణదారులు చాలా ఎత్తులో ఇళ్లను నిర్మిస్తున్నారు. దీంతో వారి వాహనాలు ఇంట్లోకి, బయటికి వెళ్లాలంటే ర్యాంపులు నిర్మించుకోవాల్సి వస్తోంది.
- అయితే గేటు లోపలి వైపు ర్యాంపులను నిర్మించుకోవడానికి బదులు గేటు నుంచి రోడ్డుపైకి ర్యాంపులను నిర్మిస్తుండటంతో ఎత్తునుబట్టి ఒకోచోట రోడ్డు మధ్యవరకు ర్యాంపులు వస్తున్నాయి.
- దీనికి తోడు గ్రీనరి పేరిట ప్రహరీనుంచి 3, 4 ఫీట్ల మేర వెడల్పులో అడ్డుగోడలు నిర్మిస్తుండటంతో రోడ్డు కుంచించుకుపోతోంది.
- రోడ్డుకు ఇరువైపులా ఇళ్ల యజమానులు ర్యాంపులు, గ్రీనరీ ఏర్పాటు చేస్తుండటంతో 20 ఫీట్ల రోడ్డు కాస్తా 10 ఫీట్ల మేర మూసుకుపోతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఇక ఉన్న 10 ఫీట్ల రోడ్డులో సైతం వారు తమ వాహనాలను పార్కింగ్ చేయడంతో ఇక దారి నుంచి వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండటం లేదు. దీంతో సదరు ఇళ్ల యజమానులు, వాహనదారుల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి.

రోడ్డు లెవెలింగ్ తెలియనందు వల్లే...

పలు డివిజన్లలో చాలా కాలనీలు ఇపుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నాయి. చాలా చోట్ల ఇంకా పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం జరగలేదు. దీంతో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు భవిష్యత్‌లో తమ ఇంటి ముందు రోడ్డును ఎంత ఎత్తులో నిర్మిస్తారో తెలియక ముందు జాగ్రత్తగా అవసరమైన దానికన్నా ఎత్తులో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇళ్లు ఎత్తులో ఉండటంతో వాహనాలు ఇంట్లోకి, బయటికి వెళ్లడానికి వీలుగా ర్యాంపుల నిర్మాణం చేపడుతున్నారు. ర్యాంపు నిర్మించాల్సివస్తే ఇంటి లోపలి నుంచి నిర్మించుకోవాలి తప్ప గేటు వద్ద నుంచి రోడ్డు పైకి నిర్మించవద్దని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సూచిస్తున్నారు.

కాలనీల్లో భారీ ర్యాంపులు నిర్మించరాదు...

కాలనీ రోడ్లపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా ఎలాంటి ర్యాంపులు, నిర్మాణాలు చేపట్టరాదని పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు అంటున్నారు. ఈ మేరకు ఆయా కాలనీ సంక్షేమ సంఘాల సమావేశంలో తీర్మానం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణం పూర్తయిన చోట ఇల్లు, అపార్ట్‌మెంట్, దుకాణాల ముందు ర్యాంపులు ఎట్టి పరిస్థితుల్లో 3 అడుగులకు మించరాదని, రోడ్డును ఆక్రమించి నిర్మించే ర్యాంపులు, నిర్మాణాలను తొలగిస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చరిత్రలో నిలిచిపోతుంది



ఉప్పల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఉప్పల్ కాంగ్రెస్ నేతలు

ఉప్పల్: ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించినందుకు కాంగ్రెస్ అధినాయకత్వానికి అభినందనలు తెలుపుతూ గురువారం ఉప్పల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ లింగంపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఉప్పల్ చౌరస్తాలోని డా.అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చరిత్రలో నిలిచిపోతుందని పలువురు నేతలు కొనియాడారు. నిరుపేదల సంక్షేమం కాంగ్రెస్ పాలనతోనే సాధ్యం అన్నారు. దేశ ప్రజలంతా కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు మేకల శివారెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, ఎ– బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి, బోరంపేట కృష్ణ, తవిడ బోయిన గిరిబాబు, ఈగ అంజయ్య, బకారం లక్ష్మణ్, మహిళా అధ్యక్షురాలు అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు నష్టం చేయవద్దని చెప్పినందుకు దాడి

మల్కాజిగిరి: నిర్మాణంలో ఉన్న రోడ్డుకు నష్టం చేయవద్దని చెప్పినందుకు దాడి చేసిన ఘటనలో మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతసరస్వతీనగర్‌లో ఇటీవల జీహెచ్‌ఎంసీ సీసీ రోడ్డు నిర్మించింది. ఆ సమీపంలో నివాసం ఉంటున్న రవీందర్ బాబు ఈ నెల 30వ తేదీన రోడ్డుకు క్యూరింగ్ కోసం నీరు పడుతుండగా ఆదే ప్రాంతానికి చెందిన రమేష్ కుమారుడు నవీన్ తన బైక్ మీద వెళ్తూ రోడ్డుకు నష్టం చేయడంతో రమేష్‌బాబు, అతడి భార్య భాగ్యలక్ష్మి ప్రశ్నించడంతో వారిపై రమేష్, నవీన్ వారిపై దాడి చేయడమే కాకుండా అసభ్యపదజాలంతో దూషించారు. ఈ ఘటనపై వారు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పల్‌లో కార్పొరేటర్ కార్యాలయం ప్రారంభం



ఉప్పల్ కార్పొరేటర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: ఉప్పల్ డివిజన్‌లో రూ.85 లక్షలతో నిర్మించిన కార్పొరేటర్ కార్యాలయాన్ని గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, అందుకు ఒక కార్యాలయం అవసరమన్నారు. ఉప్పల్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఇక నుంచి ప్రజలకు ఇక్కడి నుంచే సేవలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, ఈఈ నాగేందర్, తెల్కల మోహన్‌రెడ్డి, బోరంపేట కృష్ణ, తవిడబోయిన గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరిస్తున్న వ్యక్తి అరెస్టు

అల్వాల్: మద్యం మత్తులో కత్తి పటుకొని తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్న వ్యక్తిని నేరెడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జేజేనగర్‌కు చెందిన కుంచపు శ్రీకాంత్(25) గురువారం రోజు నేరెడ్‌మెట్‌లో మద్యం మత్తులో కత్తి పట్టుకొని భయపెడుతున్నాడు. రూ.500లు ఇవ్వమని లేదంటే.. దాడి చేస్తానని స్థానికంగా నివసించే వడ్డెర రాజును బెదిరించడంతో అతడు నేరెడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడు గతంలో జైలుకు వెళ్లి వచ్చాడని తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు ఉద్యోగ విరమణ

బోడుప్పల్: చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ డిపో క్లర్క్‌లుగా విధులు నిర్వర్తిస్తున్న సయ్యద్ నాసర్ అహ్మద్, రవీందర్‌లు గురువారం ఉద్యోగ విరమణ చేశారు. వారిని డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్ ఆనందరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు సత్యన్, అశోక్ కుమార్, అధికారులు, తోటి ఉద్యోగులు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు.

తైబజార్ గుత్తేదారుకి రూ.5 వేల జరిమానా



జరిమానా పత్రాన్ని అందజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి

బోడుప్పల్: చెంగిచర్లలో రాఖీ పండగను పురస్కరించుకుని ఓ మహిళ రోడ్డు పక్కన రాఖీ షాపు పెట్టుకుంది. తైబజార్ గుత్తేదారు రుసుం చెల్లించలేదని ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించి రాఖీ బాక్స్‌లు బలవంతంగా తీసుకెళ్లారు. సదరు మహిళ ఇదే విషయమై బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన కమిషనర్ ఫిర్యాదును విచారించి తైబజార్ గుత్తేదారుకి రూ.5 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతమైతే గుత్తేదారు లీజు అగ్రిమెంట్‌ను రద్దు చేస్తామని అన్నారు.

నేడు దివ్యాంగులకు పింఛన్ ప్రొసీడింగ్స్ పంపిణీ

మల్కాజిగిరి: దివ్యాంగులకు పెరిగిన పింఛన్ మొత్తానికి సంబంధించిన నూతన ప్రొసీడింగ్స్ పంపిణీ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆనంద్‌బాగ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుగుతుందని అధికారులు తెలిపారు. దివ్యాంగులకు గతంలో ఉన్న రూ.3,016 పింఛన్ మొత్తాన్ని ఇటీవల ప్రభుత్వం రూ.4,016 పెంచిన సంగతి విధితమే.. అనంతరం నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని ఆర్‌కెపురం లేక్ బ్యూటిఫికేషన్ పనులకు స్థానిక కార్పొరేటర్ మీనారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

'పుర' కార్మికులకు ఆరోగ్య భద్రత

- ఇక పురపాలక సంఘాల్లోని కార్మికులకు పూర్తిస్థాయిలో ఈఎస్ఐ వర్తింపునకు చర్యలు
- నగర శివారుల్లోని 29 పురపాలికల్లో పనిచేస్తున్న 5,897 మంది కార్మికులకు ప్రయోజనం

సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఇక పూర్తి స్థాయిలో ఈఎస్ఐ అమలు కానుంది. ఈ మేరకు ఇటీవల పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈఎస్ఐ(ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్, పీఎఫ్ (ప్రావిడెండ్ ఫండ్) సౌకర్యం కల్పించినా.. ఆయా చెల్లింపులు చేయకపోవడంతో సేవలు అందేవి కావు. కొన్ని పురపాలికలు మూడు, నాలుగు నెలలకు ఓసారి ఈఎస్ఐ రుసుం జమ చేసేవి. దీన్ని గుర్తించిన పురపాలకశాఖ ఒక ప్రతినెలా కచ్చితంగా ఈఎస్ఐ చెల్లింపులు చేయాలని ఆదేశించింది.

5,897 మంది కార్మికులకు ప్రయోజనం...

గ్రేటర్ శివారు జిల్లాలలో 29 పురపాలక సంఘాలు ఉన్నాయి. వీటిలో అన్ని విభాగాల్లో కలిపి 5,897 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరు అనారోగ్యానికి గురైతే పురపాలికల తీరువల్ల ఈఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని పురపాలికల్లో బకాయిలు చెల్లించకపోవడంతో కార్డులున్నా.. నిరుపయోగంగా.. మారాయనే విమర్శలొస్తున్నాయి. ఇకమీద నెలనెలా ఈఎస్ఐ రుసుం చెల్లిస్తే కార్మికుల వైద్య సేవలకు ప్రయోజనం దక్కనుంది. ప్రతి నెలా కార్మికులకు చెల్లించే వేతనాల్లో పీఎఫ్ వాటాగా 12 శాతం, ఈఎస్ఐ వాటాగా 0.75 శాతం మినహాయించుకుంటారు. ఆ మొత్తాన్ని అదే నెల 15వ తేదీలోపు సంబంధిత ఖాతాలకు జమ చేయనున్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఏడాదికి రూ. 2.5 లక్షల వరకు వైద్యాన్ని ఉచితంగా పొందటానికి అవకాశముంటుంది.

మైదానం.. అనుకుంటున్నారా..?



మేడ్చల్: వావ్.. సెలవు దొరికితే హాయిగా క్రికెట్ ఆడుకోవచ్చు.. ఉదయం, సాయంత్రం ప్రశాంతంగా వాకింగ్ చేసుకోవచ్చు అనుకుంటే.. కుంటలో కాలేసినట్లే.. మేడ్చల్–గౌడవెల్లి రోడ్డులో ఉన్న కుంట పరిస్థితి ఇది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుంట నీటితో పూర్తిగా నిండింది. ఈ కుంటకు ఆయకట్టు లేకపోవడంతో ఏడాది పొడవునా ఎప్పుడూ నీటితో నిండి ఉంటుంది. సమీప కాలనీల మురుగు కుంటలోనే చేరడంతో కుంట కలుషితమై గుర్రపు డెక్క పెరిగి ఇటీవల మొత్తం ఎండిపోయింది. దీంతో ఆ ప్రాంతం ఓ మైదానంలా కనిపిస్తోంది. కుంట కట్ట మీద ఉన్న రోడ్డుపై వెళ్తుంటే.. రోడ్డుగా సమానంగా ఉంది. దీంతో అది మైదానం అని పొరపాటున అటువైపు వెళ్తే కుంటలో మునిగిపోవాల్సిందే.. కట్టపై నుంచి నిత్యం వందలాది వాహనాలు తిరుగుతున్నాయి. రాత్రి వేళలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఎవరైనా కొత్తవారు అటువైపు వెళ్లి.. మైదానం అనుకొని వాహనంతో అటువైపు వెళ్తే ప్రమాదం తప్పదు. దానికి తోడు గుర్రపు డెక్క ఎండిపోయి దోమలకు ఆవాసంగా మారింది. సాయంత్రం, రాత్రి పూట దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించడంతో పాటు కట్టను అభివృద్ధి చేసి కంచె ఏర్పాటు చేయాలని స్థానికులతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వివేక్‌నగర్ కాలనీవాసులు

హబ్సిగూడ: రామంతాపూర్ వివేక్‌నగర్ కాలనీలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు గురువారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి స్పందించి సంబంధిత అధికారులకు విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గరిక సుధాకర్, రాజు, కాలనీవాసులు వంశీకృష్ణ, బాలు, మల్లేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



ఓల్డ్‌మల్లాపూర్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్ ఈద్మమ దేవాలయం వద్ద 15 రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్డును తవ్వారు. దీంతో తవ్విన రోడ్డు, సిమెంట్ దిబ్బలను ఎత్తకపోవడంతో స్థానిక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును ఎత్తు పెంచడానికి సీసీ వేయకపోవడంతో చుట్టుపక్కల ఉన్న డ్రైనేజీలు లీక్ అయ్యాయి.. దీంతో ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోందని స్థానికుడు తునికి గణేష్ తెలిపారు. వృద్ధులు, చిన్నారులు ఈ రోడ్డు మీదుగా నడిచేందుకు వీలులేకుండా ఉందని, వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి సీసీరోడ్డు వేయాలని కోరుతున్నారు.